సాక్షి
నిజామాబాద్
శనివారం । 17 । ఆగస్టు । 2024



రహదారులు జలమయం

నిజామాబాద్ నగరంలో శుక్రవారం కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

- 10లో ▸



ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /25.6

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బోధన్-కాచిగూడ రైలు పున:ప్రారంభం

బోధన్/ఖలీల్‌వాడి: బోధన్-కాచిగూడ ప్యాసింజర్ రైలును శుక్రవారం రాత్రి నుంచి పున:ప్రారంభించినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. శనివారం ఉదయం 5.30 గంటలకు బోధన్ స్టేషన్ నుంచి ప్యాసింజర్ రైలు బయలు దేరనుంది. మూడు నెలల క్రితం ఈ రైలును రద్దు చేశారు. ఈ రైలు బోధన్ నుంచి కాచిగూడ, మహబూబ్‌నగర్ మీదుగా గుంతకల్ వరకు నడుస్తుంది. బోధన్ రైల్వే స్టేషన్ నుంచి ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు బయలుదేరి కాచిగూడ స్టేషన్‌కు 11 గంటలకు చేరుకుంటుంది. సాయంత్రం 4.30 గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి రాత్రి 11 గంటలకు బోధన్‌కు చేరుకుంటుంది.

నరేందర్ కస్టడీకి పిటిషన్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగర కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్ నరేందర్ కస్టడీకి నిజామాబాద్ ఏసీబీ పిటిషన్ దాఖలు చేసింది. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని ఈ నెల 9న నరేందర్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సోదాల్లో రూ.2.93 కోట్ల నగదు దొరికింది. నరేందర్‌కు రూ.6.7 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం నరేందర్ చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఆయనను కస్టడీలోకి తీసుకున్న తర్వాత మరిన్ని వివరాలను రాబట్టేందుకు ఏసీబీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. నరేందర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న ముగ్గురిని పిలిచి ఏసీబీ అధికారులు విచారణ చేసినట్లు తెలిసింది. నరేందర్‌ను కస్టడీకి తీసుకున్న తర్వాత ఏసీబీ అధికారులు ఆయన సమక్షంలోనే బ్యాంక్ లాకర్లను ఓపెన్ చేయనున్నట్లు తెలిసింది.

వైద్యుల నియామకానికి కృషి



బోధన్ టౌన్: బోధన్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వైద్యుల కొరతను తీర్చడానికి త్వరలో నియామకాలు చేపడుతామని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. బోధన్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని శుక్రవారం ఆయన సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఆస్పత్రిని సందర్శించినట్లు చెప్పారు. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డీసీహెచ్ఎస్ శివశంకర్, వైద్యులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ అర్బన్: నగరంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ మకరంద్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ప్రజల ను కలవడం లేదని, ప్రజా సమస్యలపై స్పందించడం లేదని ఇటీవల 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆయన నగర ప్రజలకు అందుబాటులో ఉండేందుకు సమయాన్ని కేటాయించారు. ఆయా డివిజన్‌లలో ఆకస్మిక తనిఖీలు చేసి సమస్యలను పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. 13వ డివిజన్‌లో లే అవుట్ లేని వెంచర్లను పట్టణ ప్రణాళిక అధికారి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. అనంతరం గౌతమ్ నగర్, దుబ్బ, ఆదర్శనగర్ ప్రాంతాల్లో పర్యటించారు.



నగరంలోని కోటగల్లి మార్కండేయ మందిరంలో వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు



కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

జిల్లావ్యాప్తంగా శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, సామూహిక వ్రతాలు జరిపారు. ఇళ్లలో అమ్మవారిని ప్రతిష్ఠించి మొక్కులు చెల్లించుకున్నారు. సుహాసినులకు వాయినాలు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

–నిజామాబాద్ రూరల్

సెల్లార్ అనుమతి లేకుండానే
భవన నిర్మాణాలు

- కమర్షియల్ భవనాలకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సహకారం
- తాజాగా ప్రధాన రహదారి పక్కన ఇలాంటి వాటికి ప్రోత్సాహం
- ఒకే ఐడీపై అనేక దరఖాస్తులకు అనుమతులు
- ప్రభుత్వ ఫీజుకు గండికొట్టి జేబులు నింపుకుంటున్న వైనం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, ఉద్యోగులు అడ్డూఅదుపు లేకుండా దండుకుంటున్నారు. అడుగడుగునా అవినీతి, అక్రమాలు, అవకతవకలకు కేరాఫ్ అడ్రస్‌గా ఈ విభాగం ఉద్యోగులు తయారయ్యారు. టీఎస్ బీపాస్ నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల దోపిడీకి అవధులు లేకుండా పోయినట్లు పలువురు బాధితులు చెబుతున్నారు. అక్రమ కట్టడాల విషయంలో బాధ్యత ఎన్‌ఫోర్స్‌మెంట్ వారికి ఇవ్వడంతో తమకేం బాధ్యత లేదన్నట్లుగా టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు వ్యవహరిస్తున్నారు. కేవలం అనుమతులు ఇచ్చే పేరిట ప్రభుత్వ ఫీజులకు భారీగా గండి కొడుతూ జేబులు నింపుకుంటున్నారు. కమిషనర్‌గా ఎవరున్నా.. ఏ కమిషనర్ హయాంలో నైనా తమకెదురే లేదన్నట్లుగా దోపిడీ పర్వం నడిపిస్తున్నారు. ఈ క్రమంలో సెట్‌బ్యాక్, సెల్లార్ అనుమతులు తీసుకోని వారిని కూడా నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నారు.

■ అనుమతులు ఇచ్చే విషయంలో లొసుగుల గురించి దరఖాస్తుదారులకు ఏకంగా టౌన్ ప్లానింగ్ అధికారులే వివరించి భారీగా ప్రభుత్వ ఫీజులకు గండి కొడుతున్నారు. కమర్షియల్ భవనాలకు నివాస గృహాల పేరిట అనుమతులు ఇస్తున్నట్లు చూపించి బ్యాంకు రుణాలకు వడ్డీలు తగ్గించేందుకు, మరోవైపు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు తమ బొక్కసంలో వేసుకుంటున్నారు.

ఉదాహరణకు గతంలో ఒక భవనానికి సంబంధించి రూ.66,760 ఫీజు కట్టాల్సి ఉండగా దాన్ని మర్చి కేవలం రూ.3,440 కే తగ్గించడం ఈ విభాగం అధికారుల చిత్రవిచిత్రానికి ఒక నిదర్శనం. మరోవైపు ఒక మధ్యవర్తిని ఏర్పాటు చేసుకుని ఒకే ఐడీ మీద వందల దరఖాస్తులు చేయించి వ్యవహారాలు నడపడం గమనార్హం. ఇటీవల ఒక మధ్యవర్తి ఐడీ పేరుమీద ఏకంగా 66 దరఖాస్తులు చేయించడం చెప్పుకోదగ్గ అంశం. టీఎస్‌బీపాస్‌ను తమ చుట్టంగా మార్చుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు తాము ఆడిందే ఆట, పాడిందే పాట అన్నవిధంగా వ్యవహరిస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఇటీవల ఇక్కడి నుంచి బదిలీ అయిన టౌన్ ప్లానింగ్ తిమింగలాలను పట్టుకోవాలని, ఇందుకోసం ప్రభుత్వం సదరు ఉద్యోగులు అనుమతులు ఇచ్చిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయి వివరాలు సేకరించాలని, ఫీజులు, ఫైళ్ల వివరాలను తనిఖీలు చేయించి విచారించాలని డిమాండ్లు వస్తున్నాయి.

■ తాజాగా నగరంలోని ప్రధాన రహదారి పక్కన ఎల్లమ్మగుట్ట, కపిల హోటల్ ప్రాంతాల్లో సెల్లార్ అనుమతులు లేకుండానే భారీ కమర్షియల్ భవనాల నిర్మాణాలు చేస్తుండడం విశేషం. పైగా వీటికి సెట్‌బ్యాక్ సైతం లేదు. ఇటీవల 51 తులాల బంగారంతో పాటు మొత్తం రూ.6 కోట్ల ఆస్తులతో ఏసీబీకి పట్టుబడ్డ కార్పొరేషన్ సూపరింటెండెంట్ నరేందర్ భాగస్వామిగా ఉన్న భవనం సైతం నిర్మాణంలో ఉందని చర్చ నడుస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే నగరంలోని కంఠేశ్వర్, ప్రగతినగర్, ద్వారకానగర్, ఖలీల్‌వాడి ప్రాంతాల్లో సెట్‌బ్యాక్, సెల్లార్ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా నిర్మాణాలు చేస్తున్నారు. ఇలాంటి వారివద్ద టౌన్‌ప్లానింగ్ అధికారులు విచ్చలవిడిగా దండుకుంటున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- జూనియర్ డాక్టర్ల డిమాండ్
- కోల్‌కతా ఘటనపై నగరంలో నిరసన



మద్దతు తెలుపుతున్న ఐఎంఏ ప్రతినిధులు

నిజామాబాద్ నాగారం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడి చేసి హతమార్చిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జీజీహెచ్ నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. మానవహారంగా ఏర్పడి సుమారు గంటపాటు నిరసన తెలిపారు. జూడాల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ నీరడి మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. నిందుతుడికి శిక్ష పడే వరకు ఉద్యమాన్ని ఆపబోమన్నారు. జూడాలు విద్యాన్, కార్తీక్, భగీరథ తదితరులు పాల్గొన్నారు. జూనియర్ డాక్టర్ల నిరసన కార్యక్రమానికి ఐఎంఏ ప్రతినిధులు మద్దతు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రావు, కార్యదర్శి శ్రీశైలం, జలగం తిరుపతిరావు, కవితారెడ్డి నిరసనలో పాల్గొని మద్దతు ప్రకటించారు.

నేడు బంద్‌కు పిలుపు

జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు శనివారం స్వచ్ఛందంగా బంద్ పాటించాలని ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దామోదర్‌రావు, శ్రీశైలం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు ఆస్పత్రుల్లో సేవలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతాయన్నారు.



నగరంలో మానవహారం నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

రుణమాఫీపై గందరగోళం!

- రూ.రెండు లక్షల కంటే ఎక్కువ ఉన్న మొత్తాన్ని ముందే కట్టాలన్న ప్రభుత్వం
- అవగాహన లేక మాఫీకి దూరమైన అన్నదాతలు
- ఖాతాలకు చేరని మూడో విడత సొమ్ము
- వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు

మోర్తాడ్: ప్రభుత్వం మూడు విడతల్లో పంట రుణాల మాఫీ చేసినా జిల్లాలో చాలామంది రైతులకు మాఫీ కాలేదు. రూ.రెండు లక్షల కంటే ఎక్కువ లోన్ ఉన్న రైతులు ఎక్కువ ఉన్న సొమ్మును చెల్లించాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. ఆ సొమ్ము బ్యాంక్‌లో కడితేనే రూ.రెండు లక్షలు మాఫీ చేస్తామని తెలిపింది. అయితే చాలా మంది రైతులకు దీనిపై అవగాహన లేక ఎక్కువ ఉన్న మొత్తం కట్టలేదు. దీంతో మూడో విడతలో వారికి మాఫీ కాలేదు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రూ.రెండు లక్షల లోన్ మాఫీ చేయకుండా అదనంగా ఉన్న బకాయిని సాకుగా చూపించడం ఎంత వరకు సమంజసం అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

మూడో విడత మాఫీ సొమ్మును విడుదల చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం ప్రకటించారు. అయితే మాఫీ అయ్యే రైతులు జాబితా వెలువడలేదు. దీంతో రైతులు శుక్రవారం బ్యాంకులకు వెళ్లి మాఫీ అయ్యిందా లేదా అని ఖాతాలను పరిశీలించుకున్నారు. రూ.రెండు లక్షలకు మించి ఎంత బకాయి ఉన్నా మాఫీ సొమ్ము జమ కాలేదు. అలాగే రూ.రెండు లక్షల లోపు ఉన్న రైతులకు కూడా ఇంకా ఖాతాల్లో జమ కాలేదు. వీరికి రెండు రోజుల్లో సొమ్ము జమ అయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. రూ.రెండు లక్షల కంటే ఎక్కువ ఉన్న రుణాన్ని ఇప్పుడు చెల్లిస్తే మాఫీ అమలు అవుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులను మోసం చేస్తున్నారు



రుణమాఫీ విషయంలో ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది. అర్హులైన రైతులకు మాఫీ సొమ్మును జమ చేయకుండా నిబంధనల పేరిట కోత విధిస్తోంది. ప్రభుత్వం మాట నిలబెట్టుకోకపోతే ఆందోళనలు చేస్తాం.

– తోకల నర్సయ్య, మాజీ సర్పంచ్, తాళ్లరాంపూర్

ప్రభుత్వ తీరు సరికాదు



రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెప్పింది ఒక్కటి చేస్తుంది మరొకటి. అర్హులైన అనేక మందికి మాఫీ అమలు కాలేదు. ఇది సరైన పద్ధతి కాదు. ఉత్తుత్తి ప్రకటనలతో రైతులను మోసం చేస్తూ మాఫీ సొమ్ము ఎగ్గొట్టాలని చూస్తున్నారు.

– పాపాయి పవన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మోర్తాడ్

రుణమాఫీ పేరిట సీఎం మోసం

- నేటికీ హామీలు అమలు చేయలేదు
- ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మంది రైతులకు దక్కని రుణమాఫీ
- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ అర్బన్: రుణమాఫీ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో చాలా మంది రైతులకు మాఫీ అమలు కాలేదన్నారు. రుణమాఫీ మోసంపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నేటికి అమలు చేయడం లేదన్నారు. వానాకాలం సీజన్ సగం పూర్తయినా ఇంకా రైతులకు పెట్టుబడి సాయం జమ చేయలేదని విమర్శించారు. రుణమాఫీ కూడా కొంతమంది రైతులకే వర్తింపజేశారన్నారు. మూడో విడత రుణమాఫీ రైతుల జాబితా నేటికి రాలేదన్నారు. రూ.31 వేల కోట్ల రుణాలకు రూ.17,900 కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. 2016లో సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో 3,79,520 మంది రైతులకు రూ.1571.25 కోట్ల రుణమాఫీ చేస్తే, ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ 1.76 లక్షల మందికి రూ.1281 కోట్లు మాత్రమే మాఫీ చేశారని వివరించారు. ఇంకా రెండు లక్షలపైగా అన్నదాతలు మాఫీకి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. రుణమాఫీపై ప్రజలు కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం నిరసనలు చేయాలని, ఇందుకు తమ పార్టీ సహకారం ఉంటుందని చెప్పారు. నాయకులు కొత్తూరు లక్ష్మారెడ్డి, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, మురళి, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



ఖలీల్‌వాడి: రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం జరగడానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం ఒక కారణం. దీంతో గురువారం(ఈ నెల 15) నుంచి జిల్లాలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీపీ కల్మేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. తనిఖీలు విస్తృతం చేశారు. ఇందులో భాగంగా హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేశారు. అలాగే మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్‌లపై దృష్టి పెట్టారు. నిబంధనలు పాటించని వాహనదారులు జరిమానాలతో పాటు కేసులు నమోదు చేయనున్నారు.

అవగాహన కార్యక్రమాలు

పోలీసులు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. బైక్‌పై వెళ్లేవారు హెల్మెట్ పెట్టుకోవాలని సూచిస్తున్నారు. హెల్మెట్‌తో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. నాసిరకం హెల్మెట్లు కాకుండా ఐఎస్ఐ మార్క్ ఉన్నవి కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.

కాగా గతంలో బైక్ కొనే సమయంలో షోరూం నిర్వాహకులు ఉచితంగా హెల్మెట్ ఇచ్చేవారు. ఇప్పుడు అలా ఇవ్వడం లేదు. వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో హెల్మెట్ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. దీంతో కొందరు ఇతరుల హెల్మెట్ తీసుకెళ్లి తంతు ముగిస్తున్నారు. షోరూంలలో హెల్మెట్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ జరిమానాల వివరాలు (రూ.లలో)	
సిగ్నల్ జంప్	100
హెల్మెట్ లేకపోతే	100
లైసెన్స్ లేకపోతే	500
అతివేగం	400
ర్యాష్ డ్రైవింగ్	1000
ట్రిపుల్ రైడింగ్	1,200

గతంలో అమలు చేసినా..

నిజామాబాద్ సీపీగా కార్తికేయ పనిచేసిన సమయంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి అని ఆదేశాలు జారీ చేశారు. దీనిని పోలీసులు కఠినంగా అమలు చేశారు. దీంతో అప్పట్లో బైకర్లు హెల్మెట్ లేకుండా బయటకు రావడానికి భయపడ్డారు. తర్వాత నామమాత్రం చేయడంతో చాలా మంది హెల్మెట్ వాడటం లేదు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ నారాయణ

ఖలీల్‌వాడి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సూచించారు. నగరంలోని బస్టాండ్‌లో శుక్రవారం ఆయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. బైక్‌లతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, హెల్మెట్ పెట్టుకుంటే ప్రాణాలు దక్కే అవకాశం ఉంటుందన్నారు. ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.

మహిళలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి

ఖలీల్‌వాడి: మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మానాల మాట్లాడుతూ.. బస్సుల్లో బ్రేక్ డ్యాన్సులు చేసుకోవచ్చని మాట్లాడిన కేటీఆర్‌కు బుద్ధి చెబుతామన్నారు. పదేళ్లు క్లబ్బుల్లో గడిపిన కేటీఆర్‌కు మహిళలను గౌరవించడం తెలియదన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు వినియోగించుకుంటున్నారని, దీనిపై కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందని ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

కేటీఆర్ వ్యాఖ్యలను జిల్లాకు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, సంతోష్, నరేందర్ గౌడ్, మతం రేవతి, గాజుల సుజాత, మలైకా బేగం, అపర్ణ, మీనా, సంగెం సాయిలు, గోవర్ధన్, ప్రమోద్, సంగుబాయి, విశాల్, నిఖిల్ రెడ్డి, గౌతం, ఆకుల మధు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

17శాతం హెచ్ఆర్ఏ చెల్లించాలి



నిజామాబాద్అర్బన్: నిజామాబాద్ నగర కార్పొరేషన్ సరిహద్దు నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలు, తండాల్లో విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులందరికీ 17శాతం హెచ్ఆర్ఏ అమలు చేయాలని టీఎస్యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యానంద్, రమేశ్ డిమాండ్ చేశారు. హెచ్ఆర్ఏ అమలు చేసే క్రమంలో గతంలో ఇచ్చిన ఉత్తర్వుల జాబితాలో కొన్ని చేర్చలేదని, వాటిని కూడా జాబితాలో చేర్చాలని అదనపు కలెక్టర్ కిరణ్కుమార్కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. మాక్లూర్ మండలంలోని అమ్రాద్ తండా, మదన్పల్లి తండా, సట్లాపూర్ తండా, గద్వాల్ క్యాంపు, వేణుకిసాన్ నగర్, ఒడ్డెర కాలనీ (మామిడిపల్లి), జక్రాన్పల్లి మండలం పుప్పాలపల్లి, డిచ్పల్లి మండలం వెస్లీనగర్కు 17 శాతం ఇంటి అద్దె అలవెన్స్ చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మల్లేశ్, జిల్లా కార్యదర్శులు ఎం.జనార్దన్, వి సాయన్న పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి పెరిగిన ఇన్ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్లోకి ఇన్ఫ్లో పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో 11 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500, లక్ష్మికాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 522 క్యూసెక్కుల నీరుపోతోంది. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా.. శుక్రవారం సాయంత్రానికి 1081.10(48.07 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

పీజీ పరీక్షాకేంద్రాల తనిఖీ



తెయూ(డిచ్పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో పీజీ రెగ్యులర్ నాల్గో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భవనంలోని పరీక్షా కేంద్రాన్ని రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్సిటీ మెయిన్ క్యాంపస్, సౌత్ క్యాంపస్ (భిక్కనూరు), గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజీ (నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (కామారెడ్డి), ఎస్ ఆర్ఎన్కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్మూర్) పరీక్షా కేంద్రాల్లో సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 773 మంది విద్యార్థులకు గాను 738 మంది విద్యార్థులు హాజరు కాగా 35 మంది గైర్హాజయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

'ఈ పాస్' ద్వారా ఎరువులు విక్రయించాలి



భీమ్గల్: మండలంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని, ఈ పాస్లో పొందుపర్చిన స్టాక్కి, నిల్వ ఉన్న మొత్తానికి తేడా ఉండొద్దని డీలర్లకు సూచించారు. స్టాక్ వివరాలు కనిపించే విధంగా బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట భీమ్గల్ ఏడీఏ మల్లయ్య ఉన్నారు.

అట్టహాసంగా ఫుట్బాల్ టోర్నీ ప్రారంభం

- రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న తొమ్మిది జిల్లాల జట్లు
- మొదటి రోజు విజయం సాధించిన నిజామాబాద్, మెదక్ జట్లు



టోర్నీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్లో 10వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్బాల్ టోర్నీ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. నగరానికి చెందిన డాక్టర్ కవిత సౌజన్యంతో నిర్వహిస్తున్న టోర్నీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఏఆర్ ఏసీపీ నాగయ్య, ఫుట్బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీపీ పాల్గుణ హాజరై మాట్లాడారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, ప్రభుత్వ ఉద్యోగాల్లో సైతం రిజర్వేషన్ వెసులుబాటు ఉంటుందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల చొరవతో క్రీడాకారులు పదో తరగతి వరకు పాఠశాల స్థాయిలో క్రీడల్లో రాణిస్తున్నారని, ఇంటర్కు రాగానే విద్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి క్రీడలను మధ్యలోనే వదిలేస్తున్నారన్నారు. క్రీడారంగంలో లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధించే వరకు నిరంతరం సాధన చేయాలన్నారు. అనంతరం ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈగ సంజీవరెడ్డి, బొబ్బిలి నర్సయ్య, రాష్ట్ర బాస్కెట్బాల్ సంఘం అధ్యక్షుడు మంతెన రాజేందర్రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులకు కొదవలేదని.. యెండల సౌందర్య, నిఖత్జరీన్, హుస్సాముద్దీన్, గుగులోత్ సౌమ్య వంటి క్రీడాకారులు జిల్లా నుంచి వెళ్లి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. అంతకుముందు క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని ముఖ్యఅతిథులు స్వీకరించారు. భారత జట్టులో రాణిస్తున్న గుగులోత్ సౌమ్య తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. టోర్నీలో తొమ్మిది జిల్లాలు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్లు నిర్వహిస్తున్నట్లు ఫుట్బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మీర్ ఫారుక్ అలీ, మహమ్మద్ జావీద్ తెలిపారు.

మొదటి రోజు మ్యాచ్లు..

నిజామాబాద్ – నల్గొండ జట్ల మధ్య మొదటి మ్యాచ్ను నిర్వహించగా, 3–0 తేడాతో నల్గొండ జట్టుపై నిజామాబాద్ జట్టు విజయం సాధించింది. గుగులోత్ సౌమ్య 2, సాయి సమీక్ష ఒక గోల్ సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

రెండో మ్యాచ్లో మెదక్ – ఆదిలాబాద్ జట్లు తలపడగా, మెదక్ జట్టు ఆదిలాబాద్ జట్టుపై 7–0 తేడాతో విజయం సాధించింది. మెదక్ జట్టు క్రీడాకారిణులు శైలజ 3, చైన్య శ్రీ 2, సోని 2 గోల్స్ సాధించారు. మూడో మ్యాచ్ ఖమ్మం –వనపర్తి జట్ల మధ్య జరగగా 1–1తో డ్రాగా ముగిసింది.





మ్యాచుల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

ఆధ్యాత్మిక బాటలో పెర్కిట్–కొటార్మూర్

- హనుమాన్, శివాలయాలను పునర్నిర్మించిన వీడీసీలు
- స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్న గ్రామస్తులు
- వేగంగా సాగుతున్న కుక్కలగుట్ట వేంకటేశ్వర స్వామి ఆలయ పనులు



పెర్కిట్లో అభివృద్ధి చేసిన హనుమాన్, శివ పంచాయతన ఆలయం

ఆర్మూర్: జిల్లాలో గ్రామాభివృద్ధి కమిటీలు అంటే చాలు వివాదాస్పద అంశాలకు కేంద్ర బిందువు అని ముద్ర పడిపోయింది. కానీ అందుకు భిన్నంగా పెర్కిట్–కొటార్మూర్ గ్రామాల గ్రామాభివృద్ధి కమిటీలు ఆధ్యాత్మిక బాట పట్టి ఆలయాల పునర్నిర్మాణాల బాధ్యతలను తమ భుజాలపై వేసుకొని పలువురి మన్ననలు పొందుతున్నాయి. పన్నెండేళ్ల క్రితం పెర్కిట్ గ్రామ పంచాయతీ కొటార్మూర్ హామ్లెట్ గ్రామాన్ని ఆర్మూర్ మున్సిపల్లో విలీనం చేయడంతో ప్రస్తుతం ఆర్మూర్ పట్టణంలో కొనసాగుతోంది. కొటార్మూర్ గ్రామాభివృద్ధి కమిటీ వారు 44వ నెంబర్ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న హనుమాన్ మందిరాన్ని దాతల సహకారంతో పునర్నిర్మాణం చేపట్టారు. అలాగే పెర్కిట్ శివారులోని నిర్మల్ రోడ్డులో ఉన్న హనుమాన్ మందిరం, శివ పంచాయతన ఆలయాలను పెర్కిట్ గ్రామాభివృద్ధి కమిటీ వారు దాతల సహకారంతో అభివృద్ధి చేశారు. అయ్యప్ప, హనుమాన్ మాలధారణ చేసిన భక్తులు ఇక్కడ సన్నిదానాన్ని ఏర్పాటు చేసుకోడానికి సౌకర్యాలు సైతం కల్పించారు. మరో వైపు ఆర్మూర్, పెర్కిట్ మధ్యలో ఉన్న కుక్కలగుట్ట శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి పురాతన చరిత్ర ఉన్నప్పటికీ పెద్దగా అభివృద్ధి పనులు జరగలేవు. పెర్కిట్ గ్రామాభివృద్ధి కమిటీ వారు ఈ ఆలయంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. విలీనం అనంతరం పట్టణం నడిబొడ్డుగా మారడంతో ఈ కుక్కల గుట్ట ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దీంతో పెర్కిట్ వీడీసీ వారు ప్రభుత్వం నుంచి వచ్చే సహకారం కోసం వేచి ఉండకుండా దాతల సహకారంతో పెద్ద ఎత్తున ఆలయ పునర్నిర్మాణానికి పూనుకొని పనులను ప్రారంభించారు. ఆర్మూర్, పెర్కిట్, కొటార్మూర్ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆలయాల నిర్మాణాలకు విరాళాలు ఇస్తుండడంతో పనులు చురుకుగా సాగుతున్నాయి. వ్యక్తిగత పేరుకు ప్రాధాన్యతనివ్వకుండా పెర్కిట్–కొటార్మూర్ గ్రామాభివృద్ధి కమిటీల ప్రతినిధులు అన్ని వర్గాల వారిని కలుపుకొని ఆలయాల పునర్నిర్మాణాల పనులు చేపడుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొటార్మూర్లో పునర్నిర్మించిన హనుమాన్ ఆలయం

స్వాతంత్య్ర వేడుకల్లో బోధన్ ప్రాంత రైతులు



ఢిల్లీలో బోధన్ ప్రాంతానికి చెందిన రైతులు

బోధన్: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద గురువారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో బోధన్ ప్రాంతానికి చెందిన ఏడుగురు రైతులు పాల్గొన్నారు. నాబార్డు సంస్థ తెలంగాణ రాష్ట్ర స్థాయిలోనే బోధన్ ఏకచక్రపుర కిసాన్ ఎఫ్పీసీఎల్(ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్) ఏడుగురు డైరెక్టర్లను ఎంపిక చేసింది. ఈ మేరకు గురువారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో రైతు దంపతుల బృందం పాల్గొంది. వీరిలో సాలూర సొసైటీ సీఈవో బస్వంత్రావు పటేల్, డైరెక్టర్లు జి సత్యంరెడ్డి, గిరప్పనోర్ గంగాధర్, మండవ దిలీప్ కుమార్, దుమాలే అర్జున్రావు, జి లక్ష్మణ్, బెల్దారే మారుతీరావు దంపతులు ఉన్నారు.

224 మంది జేఎల్ఎంలకు పదోన్నతి



సుభాష్నగర్: జిల్లాలో 224 జేఎల్ఎంలకు ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్రెడ్డి ఆదేశాల మేరకు అసిస్టెంట్ లైన్మెన్గా పదోన్నతి కల్పించినట్లు విద్యుత్శాఖ ఎస్ఈ రవీందర్ శుక్రవారం తెలిపారు. నిజామాబాద్, డిచ్పల్లి ఉమ్మడి డివిజన్లో 97 మంది ఏఎల్ఎంలుగా పదోన్నతి పొందడంతో డీఈఈ శ్రీనివాస్ పవర్హౌజ్లో శుక్రవారం నియామకపత్రాలు అందజేశారు.

కార్యక్రమంలో ఏడీఈ తోట రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు. విద్యుత్శాఖలో పదోన్నతులపై రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (327 ఐఎన్టీయూసీ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్ రావు, పూదరి గంగాధర్, ఎడ్ల నాగరాజు ఆధ్వర్యంలో డీఈఈ శ్రీనివాస్రావును సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు టీఆర్వీకేఎస్ నాయకులు ఐఎన్టీయూసీలో చేరారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేష్, పెంటయ్యచారి, మనోహర్, మోహన్, శ్రీనివాస్, ముస్తాక్, నగేశ్, కల్యాణ్, ప్రభు పాల్గొన్నారు.

కల్లు డిపో నిర్వాహకులపై ఫిర్యాదు



రాజగోపాల్గౌడ్తో డిపో నిర్వాహకుల వాగ్వాదం

ఖలీల్వాడి: నగరంలోని కల్లుబట్టి నిర్వాహకుడు రాజగోపాల్గౌడ్ మూడో కల్లు డిపో నిర్వాహకులపై డయల్ 100కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం కల్లు దుకాణాన్ని తెరిచేందుకు రాజగోపాల్గౌడ్ వెళ్లగా, అక్కడికి వచ్చిన డిపో నిర్వాహకులు దుకాణాన్ని నడుపొద్దని హెచ్చరించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా దుకాణం ఎందుకు నడుపొద్దని అంటున్నారని రాజగోపాల్గౌడ్ వారితో వాగ్వాదానికి దిగగా, నిర్వాహకులు కౌంటర్ను పక్కకు నెట్టేశారు. రాజగోపాల్గౌడ్ డయల్ 100కు ఫిర్యాదు చేయగా, అక్కడికి చేరుకున్న పోలీసులు దుకాణానికి తాళం వేయాలని సూచించి అందరినీ బయటికి పంపించేశారు. ఆ తరువాత ఎస్సై శ్రీకాంత్ తనను స్టేషన్కు పిలిపించి దుకాణానికి తాళం ఎందుకు వేశావని ప్రశ్నించగా, పోలీసులు చెబితేనే వేశానని చెప్పినట్లు రాజగోపాల్గౌడ్ తెలిపారు. వారం రోజుల క్రితం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, కలెక్టర్ను కలిసి మూడో కల్లు డిపోలో స్థానికులకు అవకాశం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినందుకు తనపై కక్షగట్టారని రాజగోపాల్గౌడ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

సహకార సంఘం అవకతవకలపై విచారణ



సొసైటీ సభ్యుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న కో ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని విశాల సహకార సంఘంలో అవకతవకలు జరుగుతున్నాయని సంఘ సభ్యులు ఫిర్యాదులు అందడంతో కో ఆపరేటీవ్ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కో ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ సొసైటీని సందర్శించారు. అడ్వైజరీ కమిటీ, సంఘం సభ్యుల అభిప్రాయాలు సేకరించారు. సభ్యుల ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల కారణంగా కొంత మేర జాప్యం జరిగిందని ఆయన అన్నారు. విచారణను వేగవంతం చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

ఉమ్మడి రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచిన సొసైటీ కొంత కాలంగా నష్టాలను చవిచూస్తోంది. దీంతో పాలకవర్గం, సొసైటీ సిబ్బంది తీరుపై సభ్యులు అసంతృప్తితో ఉన్నారు. వార్షిక మహాజన సభల్లో సైతం సంఘం కార్యదర్శి, విండో చైర్మన్పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో పాలకవర్గాన్ని రద్దు చేయాలని, కార్యదర్శిని తొలగించాలని సభ్యులు తీర్మానించారు. ఈ నేపథ్యంలో పోతంగల్ సొసైటీలో అవకతవకపై విచారణ చేయాలని సభ్యులు రెండుసార్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి మృతి

విద్యుత్షాక్తో రైతు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జలాల్పూర్గ్రామానికి చెందిన చిట్కుల పోచయ్య(38)అనే రైతు విద్యుత్షాక్తో శుక్రవారం మృతి చెందినట్లు స్థానిక ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. పోచయ్య తన అల్లుడు రమేశ్తో కలిసి పొలంలోని ట్రాన్స్ఫార్మర్ వద్ద వైర్లను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి భార్య పారిజాతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీటమునిగి పశువుల కాపరి..



ఎండీ బాబు(ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన ఎండీ బాబు(21) అనే పశువుల కాపరి గురువారం సాయంత్రం గంగసాని కుంటలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. పశువులను మేతకు తీసుకెళ్లిన బాబు.. స్థానిక కుంటలో పశువులను కడుతుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడన్నారు. మృతిడి తండ్రి మహబూబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాబా పైనుంచి పడి వివాహిత..

ఖలీల్వాడి: దాబా పైనుంచి పడి వివాహిత మృతి చెందిన ఘటన నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఛత్తీస్గఢ్కు చెందిన కవిత(30) తన భర్తతో కలిసి సాయినగర్ కాలనీలో ఉంటోంది. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు కావడంతో కవిత భోజనం మానేసింది. శుక్రవారం దాబాపైకి ఎక్కిన కవిత కళ్లు తిరగడంతో కిందపడింది. ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



జబ్బర్ (ఫైల్)

పిట్లం(జుక్కల్): మండలంలోని చిన్నకొడప్గల్ శివారులో జాతీయ రహదారిపై పశువులను బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. గురువారం రాత్రి చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పిట్లంకు చెందిన లారీ ఓనర్ కం డ్రైవర్ జబ్బర్ (42) పని నిమిత్తం బైక్పై చిన్న కొడప్గల్కు వెళ్లి తిరిగి వస్తుండగా, జాతీయ రహదారిపై అడ్డువచ్చిన గేదెలను ఢీకొని కిందపడిపోయాడు. తీవ్రగాయాలపాలైన జబ్బర్ను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి ఒక కూతురు, ముగ్గురు కుమారులు ఉన్నారు.

గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు



మొక్కజొన్న తోటలో తనిఖీ చేస్తున్న డీఎస్పీ బృందం

లింగంపేట(ఎల్లారెడ్డి): మొక్కజొన్నలో అంతరంగా గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం గాంధారి మండలంలోని నేరల్తండా, చద్మల్, బీర్మల్, కొత్తబాది, గుజ్జాల్, సోమారం, గొల్లాడితండాల్లోని మొక్కజొన్న తోటల్లో వంద మంది సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా, నిల్వ చేసినా పోలీస్స్టేషన్లో సమాచారం అందించాలని ప్రజలను కోరారు. గంజాయి కారణంగా యువత పక్కదారి పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సదాశివనగర్, ఎల్లారెడ్డి సీఐలు సంతోష్, రవీందర్నాయక్, ఎక్సైజ్ సీఐ షాకీర్, గాంధారి ఎస్సై ఆంజనేయులు, ఆయా మండలాల ఎస్సైలు రంజిత్, గంగాధర్, ఏఎస్సైలు, సిబ్బంది, ఆయా మండలాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరోలారీ



క్యాబిన్లో ఇరుక్కున్న డ్రైవర్, క్లీనర్ను బయటకు తీస్తున్న పోలీసులు

ఇందల్వాయి: గన్నారం గ్రామ శివారులోని 44వ నంబరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని నాగ్పూర్ వైపు వెళ్తున్న మరో లారీ ఢీకొట్టింది. శుక్రవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటనలో డ్రైవర్తోపాటు క్లీనర్కు గాయాలైనట్లు ఎస్సై మనోజ్ తెలిపారు.

లారీ ముందుభాగం నుజ్జునుజ్జయి డ్రైవర్, క్లీనర్ అందులో ఇరుక్కుపోయారని, టోల్ప్లాజా క్రేన్ సహాయంతో వారిని బయటకు తీశామన్నారు. ప్రమాదంలో డ్రైవర్ కాలు విరగగా, క్లీనర్కు స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. బాధితులను టోల్ ప్లాజా అంబులెన్స్లో ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



ప్రణయ్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్రూరల్): ఉద్యోగానికి ఎంపికకాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. డిచ్పల్లి ఎస్సై యూ మహేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మోపాల్ మండలం కంజర్ గ్రామానికి చెందిన గుడి ప్రణయ్ (22) ఉద్యోగం కోసం సోమవారం హైదరాబాద్కు వెళ్లాడు. అక్కడ ఇంటర్వ్యూలో ఎంపిక కాకపోవడంతో తన తండ్రికి ఫోన్లో విషయాన్ని తెలిపాడు. మంగళవారం రోజు నుంచి కుటుంబ సభ్యులకు కాంటాక్ట్లో లేకుండాపోయాడు. ఇదిలా ఉండగా, డిచ్పల్లి మండలం ముల్లంగి శివారులోని నీటి కుంటలో మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అక్కడే ఉన్న బ్యాగు, సెల్ఫోన్ ఆధారంగా మృతుడిని ప్రణయ్గా గుర్తించారు. ఉద్యోగానికి ఎంపిక కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ప్రణయ్ మూడు రోజుల క్రితం కుంటలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు సేవించిన వ్యక్తి..



బీరయ్య (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాలపాటి గ్రామానికి చెందిన కడాల బీరయ్య(51) పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న బీరయ్య ఇటీవల మద్యానికి బానిసయ్యాడన్నారు. జీవితంపై విరక్తి చెందిన బీరయ్య ఇంట్లోనే పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు గమనించి హైదరాబాద్లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బీరయ్య శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య దుర్గవ్వ, ఇద్దరు కొడుకులు మల్లేశ్, రాజు ఉన్నారు.

జీజీహెచ్ నుంచి ఒకరి అదృశ్యం



గణేశ్

ఖలీల్వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్స్టేషన్ పరిధిలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి ఒకరు అదృశ్యమైనట్లు ఎస్హెచ్వో విజయ్బాబు శుక్రవారం తెలిపారు. మతిస్థిమితం సరిగా లేని డిచ్పల్లి మండలం గన్నారం గ్రామానికి చెందిన కొంకుల గణేశ్ (21)ను అతడి తండ్రి చికిత్స నిమిత్తం జీజీహెచ్కు బుధవారం రాత్రి తీసుకువచ్చాడు. రాత్రి కావడంతో అక్కడే పడుకున్నారు. ఉదయం లేచిచూసేసరికి గణేశ్ కనిపించకపోవడంతో తండ్రి నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్హెచ్వో విజయ్బాబు తెలిపారు.

నందివాడలో ఆవు మృతి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని నందివాడ గ్రామ శివారులో విద్యుత్షాక్తో ఆవు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సామ సురేశ్రెడ్డికి చెందిన ఆవు మేత మేస్తున్న క్రమంలో భూమిపై పడి ఉన్న విద్యుత్ వైర్లకు తగిలి మృతి చెందిందన్నారు. ఆవు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, విద్యుత్ అధికారులు బాధితుడిని ఆదుకోవాలని కోరారు.

అక్రమంగా పశువుల తరలింపు.. కేసు నమోదు

బాన్సువాడ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా బొలెరో వాహనంలో పశువులను తరలిస్తున్న అబ్దుల్ రజాక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పశువులను తరలిస్తున్న వాహనం పట్టుబడిందన్నారు. సాటాపూర్ సంత నుంచి జహీరాబాద్ సంతకు 7పశువులను ఇరుకుగా, కాళ్ళు కట్టేసి హింసాత్మకంగా తీసుకెళ్తుండటంతో వాహనాన్ని పోలీస్స్టేషన్కు తరలించినట్లు సీఐ తెలిపారు.